మరో అర నిముషం ఆలస్యమైతే ఇద్దరూ ఈ ప్రపంచాన్ని మరచి పోయే పరవశత్వంలోకి జారిపోయేవారే.

సరిగ్గా అప్పుడు వినిపించింది-

తలుపు తోసుకొని లోపలికెవరో వచ్చిన చప్పుడు....

కంగారుగా బెడ్‌పై నుంచి దూకి చీరందుకుని ఓ కర్టెను వెనుక నక్కేసింది.

భారంగా వాలిపోతున్న కనురెప్పల్ని బలవంతంగా తెరచి చూస్తున్న చంద్రం, కర్టెన్ వారగా చీకటిలో నిలబడ్డ కామేశ్వరి ఒక్కసారిగా షాక్ తిన్నారు.

అక్కడ ఎదురుగా....

వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లు నానీ నిలబడి వున్నాడు.

నీరసంతో నిస్త్రాణతో చూస్తున్న నానీ సైతం ముందు నమ్మలేకపోయాడు
తను నాన్న దగ్గరకే వచ్చానని.

ఇప్పుడు సరాసరి నాన్న దగ్గరికి వచ్చేశాడు.

"నా....న్నా!"

చుట్టుకుపోయాడు. కోట్ల క్షణాల నిస్త్రాణ కరిగేలా వెక్కిపడుతూ  తండ్రి ఒడిలో తలపెట్టుకుని చెప్పుకుపోతున్నాడు "నన్ను తరుముతున్నారు నాన్నా చంపేస్తారులా వుంది నాన్నా! అప్పుడే ఇద్దర్ని చంపేశాడు నాన్నా! భయమేస్తుంది నాన్నా- తొందరగా తలుపేసేయ్ నాన్నా...."

నిశిరాత్రి కలతనిద్రలోంచి ఉలికిపాటుగా మెలుకువ వచ్చిన పసికందులా గొణుగుతున్న నానీ తండ్రీ ఒడిలోనుంచి తల పైకెత్తకముందే...

త్వరత్వరగా ఒంటికి చీర చుట్టేసుకున్న కామేశ్వరి నెమ్మదిగా అడుగులేసుకొంటూ ద్వారాన్ని చేరుకుంది.

బయటకి వెళుతూ మరోసారి మంత్రిస్తున్నట్టు చంద్రాన్ని చూసింది.

అంతే....

విచక్షణ కోల్పోయిన ఆ వ్యక్తి తన రక్తంతోనే రూపుదిద్దుకున్న ఆ పసికందుపై తన ప్రతాపాన్ని చూపాలన్న ఉన్మాదంతో మంచంపైకి విసిరేశాడు.

"నాన్నా!" ఎముకలు విరిగినట్టు బాధగా మూలిగాడు.

"నన్ను చంపకు నాన్నా!"

భయంతో చేతులు జోడిస్తూ పక్కకి దొర్లాడు నానీ.

"అరేయ్..నువ్వా" అమాంతం జుట్టుపట్టుకొని దగ్గరకి లాక్కున్నాడు. "నువ్వు బ్రతికితే నేను చస్తాన్రా. అందుకు నిన్ను షంపేయ్యాల" విషం తలకెక్కిన ఉన్మాదంతో బుసలు కొడ్తున్నాడు.

"నీకు దణ్ణం పెడతా నాన్నా.... నేను మంచి నానీని అనేవాడివి కదా నాన్నా..."

చంద్రం గట్టిగా ఒడిసి పట్టుకున్నాడు.

ఒకపక్క భీతి.... నీరసం మూలంగా నానీ ఆ పట్టుకి ఊపిరి అందనట్లు కాళ్ళు, చేతులు గిలగిలా కొట్టుకుంటున్నాడు.

ప్రాణాలు పోతున్నట్టనిపిస్తే "అ...మ్మా...." అన్న ఆర్తనాదం సైతం గొంతుదాటి రాలేక గిజగిజలాడిపోతున్నాడు.

అప్పుడు చూశాడు చంద్రం నానీ నోటిలోనుంచి బయటకు ఉబికిన చిన్న నాలుకని.

వెనువెంటనే "నాలుకేదమ్మా?" అంటే ఏణ్నర్థం వయసులో నానీ ఇలాగే నాలుక చూపించిన స్మృతి మెదిలింది.

గిలగిలా కొట్టుంకుంటున్న నానీ కాళ్ళూ చేతుల్లో.... ఉయ్యాలలో ఒక నాటి నానీ తనను చూడగానే ఉత్సాహంగా కాళ్లు,చేతులు కదిలించిన మధుర స్మృతి జ్ఞప్తికి వచ్చింది.

అరక్షణంపాటు పిడికిలి సడలించాడు.

సరిగా ఇదే సమయంలో....

హోటల్లోని తన గదివేపు చకచకా నడుస్తున్న కామేశ్వరి రాజారావ్ గురించి ఆలోచిస్తోంది.

మధ్యాహ్నం హోటల్‌కి గెస్ట్ హౌస్ నుంచి షిఫ్టయ్యేటప్పుడు కలిశాడు రాజారావు.

అతను వచ్చిన పనేమిటో తెల్సిన కామేశ్వరి పనిలో పనిగా రాత్రికి గదికి రమ్మంది.

అర్థాకలితోనయినా అన్నం లేకుండా ఉండగలదు కాని ఒక్క రాత్రికి సైతం మగాడు లేకుండా నిద్రపోలేని ఆడదామె. కాని ఇంతలోనే సాయంకాలం హఠాత్తుగా చంద్రం వచ్చాడు. అందుకే అతనికి అనుమానం రాకుండా కొంతసేపు గడిపింది.

అప్పటికే ఒక గదిలో కలిసి వుంటే సమస్యేమిటి అంటూ నచ్చ చెప్పబోయాడు కూడా.....

పోలీసుల దృష్టిలో వున్న మనుషులం కాబట్టి పెళ్ళి పెటాకులు రాకుండా ఒకే గదిలో వుండి ఏ రైడింగ్‌లోనో పట్టుబడితే ఆ తరువాత పావని హత్యకేసుకి మరో ఆధారం అందించినట్టవుతుందని హెచ్చరించింది.

దానితో దారికొచ్చేశాడు చంద్రం.

చాలా ఆనందంగా వుంది కామేశ్వరికి. ఒక తలనొప్పిగా మారిన నానీ చేతికి చిక్కడంతోపాటు కొత్త సెటప్‌తో తెల్లవార్లూ గడిపే అవకాశం. పైగా ఎదురుగా వున్న రాజారావు చేతుల్లో నలిగిపోవడమన్న ఆలోచనే ఆమెని మరీ ఉత్సాహపరిచేస్తోంది.

ద్వారం తెరిచింది.

అప్పటికే బెడ్‌లైటు వెలిగించుకుని రెడీగా సోఫాలో కూర్చున్న మగాణ్ణి చూస్తూ- మనసు పడిపోతూనే వెనుకగా చేతుల్తో చుట్టేసింది. "ఎంత సేపైందొచ్చీ....? పెద్దమనిషి ఓ పట్టాన వదలడు కదా! ఒంట్లో ఓపిక లేకపోయినా నేను మగాణ్ణే అని నిరూపించుకోవాలని ఇంతసేపూ నానా హైరానా పడ్డాడు. అసలు ఇప్పుడేం జరిగిందో తెలుసా? మనకీ, మంత్రి అప్పారావుకీ

మంచి న్యూసు..అహ -ఇది ఇప్పుడు చెప్పను చెబితే చెంగున లేడిపిల్లలా దుముకుతూ బయటకి పోతావు. ముందు ఓ సారి!" అతడి తలని వెనక్కి నొక్కిపట్టి పళ్ళతో చెంపల్ని కొరికేయాలని ప్రయత్నించింది. అంతలోనే ఏదో షాక్ తిన్నట్టు గభాలున దూరంగా జరిగింది.

"నువ్వా?"

"యస్!" నిలబడిన యశస్వి మృదువుగా నవ్వుతూ- "ఆపేశావేం? చెప్పు. ఆగు, అలా బయటికి పరుగెత్తకు. అలా దిక్కులు చూడకు. అయినా నీకేంటే పదిమంది మగాళ్లకయినా ఒకేసారి బదులు చెప్పగల నింఫోమేనియాక్‌వి."

కామేశ్వరి వెన్నులో సన్నని చలిగాలి మొదలైంది. అంతదాకా రాజారావు తలపుతో వేడెక్కిన శరీరం చల్లబడిపోతున్న సూచనగా నుదుటిపై చెమట పట్టేసింది. "అయితే వాడూ నానీ వేటలో వచ్చాడన్న మాట" రెండడుగులు ముందుకేశాడు. 'వాడు' అంటే ఎవరో తెలియనివ్వకుండా.

"లేదు-" తాపత్రయపడింది.

"వచ్చాడన్నావుగా? పైగా నువ్వొచ్చిన సంగతీ వాడి ద్వారానే తెలిసింది నాకు."

"మేమిద్దరం కలిసి రాలేదు."

"కానీ- కలిసి ఒకేపని చేసే ప్రయత్నంలోవున్నారు కదూ!"

"మీరేం మాట్లాడుతున్నారో నాకు అర్థం కావటంలేదు."

"ఇలాగే వాడు అన్నాడు. కాస్త బెదిరించేసరికి వాడే నీ ఎడ్రసు చెప్పాడు."

"దొంగముండా కొడుకు" ఠక్కున కక్కింది "సరళ పంపితే వచ్చిన వాడు నేను ఆ పనిమీద వచ్చానని ఎలా అంటాడు?"

అర్థమైపోయింది..... రాజారావు ప్రస్తుతం నానీ వేటలో అక్కడున్నాడన్న విషయం.

"వెల్! పెళ్ళి మాత్రమే కాని మిస్ కామేశ్వరీ! నేనిక్కడకు వచ్చింది నువ్వు ఏయే ఊళ్లలో ఎవరెవరితో టెంపరరీ కాపరాలు పెట్టావో తెలియపరచటానిక్కాదు. ఆ రాత్రి నువ్వు మంత్రిగారితో పడకగదిలో వున్నప్పుడు జరిగిన వాస్తవాన్ని నేను ఆరా తియ్యడంలేదు. ఒక్కటే- నాకు కావలసింది ఒక్కటే-నానీ ఏమయ్యాడు -ఎక్కడున్నాడు -ఆ ఒక్క విషయం తెలియపరిస్తే చాలు- వెళ్లిపోతాను."

కామేశ్వరి కంపించిపోయింది. యశస్వి యింత దూరం ఈ వేటలో వచ్చాడన్న ఆలోచన ఆమెను భయవిహ్వాలురాల్ని చేస్తుంటే "నా....కు.... తె...లీ...దు...." అంది గొంతు తడారిపోగా....

"అలా దాటేయకు" రిలాక్సింగ్‌గా సోఫాలో కూర్చున్నాడు. "చూడు...! కామేశ్వరీ... నిన్న మొన్నటివరకు మిమ్మల్నందర్నీ ఉరికంబం ఎక్కించడమే నా ధ్యేయమయినా ఇప్పుడు నేను కోరుకుంటున్నది నానీ బ్రతకడం.... అంతే..... ఎందుకంటే ఆ పసికందుని రెచ్చగొట్టింది నేను కాబట్టి. ఈ ఒక్క సహాయం చేయి. ఈ కేసులో నీ పేరు లేకుండా చేస్తాను."

"నిజంగా నాకేటి సంబంధం!"

"అని నువ్వంటే చాలదు కామేశ్వరీ! అనుమానితుల జాబితాలో నీ పేరూ వుంది. ఏ హత్యకయినా ఓ మోటివ్ వుంటుంది. ఆ మోటివ్ నీకూ, చంద్రానికి సంబంధం వుండటమే. ఆ కారణంగానే పావనిని నీ ప్రోద్బలంపై చంద్రం హత్య చేశాడూ అని నేను నిరూపిస్తే చాలు! ఆశ్చర్యపోతున్నావా కామేశ్వరీ.....! ఇండియన్ పీనల్ కోడ్‌లో సెక్షన్ 299 అని ఒకటుంది నువ్వు ప్రత్యక్షంగా హత్య చేయకపోయినా నీ ప్రోత్సాహంతో మరొకరు నీ ప్రత్యర్థిని హత్యచేసినా, నువ్వా హంతకురాలివే అవుతావు.

కనీసం యావజ్జీవ కారాగార శిక్షపడుతుంది. ఎందుకంటే హతురాలు పావని నీలాంటి చరిత్ర హీనురాలు కాదు కాబట్టి. చెప్పు! నానీ ఎక్కడ?" ఆవేశంగా లేచి ఆమె జుట్టు పట్టుకోబోతుండగా ఫోన్ రింగయింది.

ఒక్క ఉదుటున కామేశ్వరి అటు పరుగెత్తబోయింది. కానీ బలంగా నెట్టేసిన యశస్వి రెప్పపాటులో రిసీవర్ని అందుకున్నాడు.

"కాముడూ.... వాడ్ని షంపలేకపోతున్నాను. నాకు సాధ్యం కావటంలేదు" రొప్పుతున్నట్టుగా వినిపిస్తోంది నాలుక తడబడే చంద్రం కంఠం "ఫిల్ముంరోలు వాడి దగ్గర లేదు. ఆ రాందేవ్‌ని షంపినవాడే అనసూయనే మరో ఆడదాన్ని ఇందాక కాల్చి షంపాడట. ఇది నానీ చెప్పాడు. అతను వెంటాడుతుంటేనే ఇటు పరిగెత్తుకొచ్చాడట. అందుకుని నువ్వే షంపించెయ్. నాకు.... నీరసం...." ఫోన్ జార్చిన చప్పుడు.

"డామిట్.... చంద్రంగాడిక్కడే వున్నాడన్నమాట."

కన్నతండ్రి కొడుకును చంపే పథకంలో భాగస్వామి అంటే నానీ ఇక్కడే ఎక్కడో ఉండి వుండాలి. ఉద్వేగంగా పైకి లేవబోతూ ఠక్కున ఆగాడు.

ఇప్పుడు యశస్వి కామేశ్వరి సంగతి మరిచిపోయాడు. కొన్ని వందల గంటల అలసట మరిచిపోయినట్టు హడావుడిగా రిసీవర్ అందుకుని బటన్స్ ప్రెస్‌చేసి "హలో" హోటల్ ఎక్స్‌చేంజ్‌కి ఫోన్ చేశాడు "ఇప్పుడు రూమ్ నెంబర 202కి ఫోన్ ఎక్కడ్నుంచొచ్చింది? ఆన్సర్‌మి -అయామ్ ఇన్‌స్పెక్టర్ యశస్వి స్పీకింగ్" ఇంచుమించు ఉద్రేకంతో కేకపెట్టాడు.

"రూమ్ నెంబర్ 190" ఆపరేటర్ జవాబు చెప్పాడు కంగారుగా.

దూకుడుగా బయటకు పరుగెత్తాడు.

"నా....." గదిలోకి ప్రవేశిస్తూ కేకపెట్టబోయాడు గాని నానీ కనిపించలేదు.

బాగా తాగి వున్న చంద్రం నేలపై నిషా మూలంగా సొమ్మసిల్లి పడున్నాడు.

నానీ ఈ సమీపంలోనే ఎక్కడో వుండాలి.

చివరికి తండ్రి నీడలో సైతం రక్షణ లేకపోయేసరికి పారిపోయాడు.

"నానీ.... నానీ...."

మరుక్షణం యశస్వి అరుపులతో ఆ హోటల్ ప్రతిధ్వనించ సాగింది.

అపరాత్రి ఈ ఆర్తనాదాలేమిటో అర్థం కాని కస్టమర్స్‌తో బాటు హోటల్ సిబ్బంది నిద్రలేచి

యశస్విని చేరుకున్నారు.

అప్పటికే యశస్వి హోటల్ ఆవరణలోకి అడుగుపెట్టి దిక్కులు పరికించి చూస్తూ నానీ కోసం కేకపెట్టాడు.

సరిగ్గా అదే నానీకి పరోక్షంగానైనా సహకరించింది.

హోటల్ ప్రాంగణంలో ఓ చీకటి క్రీనీడలో నిలబడిన హరి అప్పుడు పరిగెత్తుతున్న నానీని అనుసరించబోతూ ఆగిపోయాడు.

అప్పటికే అందర్నీ దాటుకుని బయటకు పరుగెత్తేవాడే కాని.... హరి షర్టంతా అనసూయ రక్తంతో తడిసిపోయి వుంది అదే అతడ్ని వారించింది.